క్లుప్తంగా

12న కేలండర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట: ఈనెల 12న లలితాబాగ్ లలితామాత ఆలయంలో సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా కేలండర్ ఆవిష్కరణ, నియోజకవర్గాల ప్రమాణ స్వీకారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్, ప్రధాన కార్యదర్శి బగ్గి శేఖర్, రాజు విరుపాక్షి తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగ బలిజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖతం'


దేవర శ్రీనివాస్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అవినీతి పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. రాష్ట్రాన్ని పాలించే సమర్థత లేని సీఎం కేసీఆర్ పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించుకోవడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న బీఆర్ఎస్‌ను ప్రజలు తరిమికొట్టడం ఖాయమని ఆయన అన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లపై ప్రజా వ్యతిరేకత


ఇంటికి కాంగ్రెస్ పోస్టర్లను అంటిస్తున్న మెట్టు సాయికుమార్

అబిడ్స్: బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ, బీఆర్ఎస్‌ల అన్యాయాలు, అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా విజయం సాధిస్తుందన్నారు. గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

బీజేపీ కార్పొరేటర్ లాల్‌సింగ్ హౌస్ అరెస్ట్


బీజేపీ కార్పొరేటర్ లాల్‌సింగ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అబిడ్స్: గోషామహల్ బీజేపీ కార్పొరేటర్ లాల్‌సింగ్‌ను మంగళ్‌హాట్ పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. అసెంబ్లీని ముట్టడించేందుకు తరలివెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా లాల్‌సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రజాకారుల పాలన కొనసాగుతుందన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులను పోలీసులు వేధిస్తున్నారని పేర్కొన్నారు. సందీప్ రాజ్ సింగ్, సోమరాజ్‌సింగ్, రాజా జవహరి, సుధాకర్ గౌడ్, దీపక్, అక్షయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సులను ఉపయోగించుకోవాలి

రాజేంద్రనగర్: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ తెలిపారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభకార్యాలకు అద్దె బస్సులపై 10 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఇది గతంలో డిసెంబర్ 31 వరకు ఉండేదని ప్రజల సౌకర్యార్థం ఈ గడువును జూన్ 30 వరకు పొడగించిందన్నారు. వివరాలకు 99592 26135, 86390 04635, 99590 22753నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

జానపద కళాకారుల అభ్యున్నతికి కృషి

హిమాయత్‌నగర్: జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా కోవిధ సహృద ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రొఫ్యూసర్ డాక్టర్ జి.అనూహ్యరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం యాదగిరిగుట్టలో జరిగిన జానపద వృత్తి కళాకారుల సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కొంతకాలంగా కళాకారులకు ఎనలేని సేవ చేస్తున్న నగరవాసి జి.అనూహ్యరెడ్డిని గౌరవ అధ్యక్షురాలిగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జానపద కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అనూహ్యరెడ్డి తెలిపారు.

నీరు కలుషితం.. అధికారులు స్పందించరేం..

నెల రోజులుగా కలుషిత నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం


బాటిల్‌లో సేకరించిన కలుషిత నీరు


సరఫరా అవుతున్న కలుషిత నీరు

గౌలిపురా: మొఘల్‌పురా డివిజన్‌లోని సుల్తాన్‌షాహీ జగదాంబ రేణుక దేవాలయం పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లో నెల రోజులుగా తాగునీటిలో డ్రైనేజీ మురుగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలకు తాగడానికి నీరందక పడరాని పాట్లు పడుతున్నారు. రోజు విడిచి రోజు వచ్చే తాగునీటి సరఫరాలో మొదటి అరగంట పాటు కలుషిత నీరు సరఫరా అవుతుందని.. తాగడానికి సరిపడా నీరు అందడం లేదని.. దీంతో తాము బయటి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు కలుషిత నీటి కారణంగా అనారోగ్యానికి గురి కాకముందే కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా మల్లయుద్ధం పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ముఖేష్‌గౌడ్ మల్లయుద్ధం రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 2వ రోజు శుక్రవారం అండర్ 15–17 విభాగాలతో పాటు పురుషుల సీనియర్ విభాగంలో 55, 60, 66 కేజీల క్యాటగిరిల్లో పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, మల్లయుద్ధం పోటీలను అభినందిస్తూ ఒక వీడియో సందేశాన్ని పంపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున పోటీలను నిర్వహించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. మల్లయుద్ధం పోటీల్లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆయుర్వేద వైద్యులు స్వయంగా మందులు తయారు చేసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ సురేందర్ శర్మ

చార్మినార్: విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశానికి చెందిన పలువురు ఆయుర్వేద వైద్యులు విశ్వ మంగల్ దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. విశ్వ మంగల్ దివస్ కార్యక్రమంలో భాగంగా పాతబస్తీ ఘాన్సీబజార్‌లోని ఆర్ఎస్ఎస్ ఆయుర్వేద కేంద్రంలో జరిగిన ఆయుర్వేద వైద్యులు–స్వయంగా ఆయుర్వేద మందుల తయారు అనే అంశంపై తెలంగాణ ప్రభారి, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సురేందర్ శర్మ మాట్లాడారు. ఆయుర్వేద బ్యాచిలర్ డిగ్రీతో పాటు పీజీ చేసిన వైద్యులందరూ స్వయంగా మందులను తయారు చేసుకుంటే రోగులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఆయుర్వేద వన మూలికలు అధిక స్థాయిలో లభిస్తున్నాయని.. ముడి సరుకు లేదంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై ఆధారపడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రభారి డాక్టర్ ఎం.భాస్కర్‌రావు, తెలంగాణ సహ ప్రభారి డాక్టర్ రఘుపతి గౌడ్, డాక్టర్ నిరంజన్ జకోటియా, డాక్టర్ రాముతో పాటు అధ్యక్షుడు డాక్టర్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.


సందడిగా వార్షికోత్సవం


ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

గోల్కొండ: టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని బచ్‌పన్ అండ్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బచ్‌పన్ ఏహెచ్‌పీఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసే విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులకు దేశం గురించి, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ కో ఆపరేటివ్ డైరెక్టర్ పిజయ్ గుప్తా, డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఇందూలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జుంబా ఫిట్‌నెస్, గోవా థీమ్, మైఖేల్ జాక్సన్ థీమ్ ఆకట్టుకున్నాయి.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: సరళమైన భాషలో ఆధునిక కవిత్వాన్ని రచించడం ఎంతో ప్రశంసనీయమని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం రవీంద్రభారతిలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన కండీషన్ సప్లయ్ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికీ సమాజంలో ఉన్న కుల వివక్షతను కథల రూపంలో చక్కగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంట చక్రపాణి, సినీ దర్శకుడు ఉడుగుల వేణు, కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కథకురాలు తోట అపర్ణ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

ఆటోడ్రైవర్ల చలో అసెంబ్లీ భగ్నం

సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు



హిమాయత్‌నగర్: ఆటో డ్రైవర్ల సమస్యలపై తలపెట్టిన చలో అసెంబ్లీ భగ్నమయ్యింది. ముందస్తు సమాచారం ఇవ్వడంతో ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టులు చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ'ని నారాయణగూడ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ కన్వీనర్, ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం మాట్లాడుతూ.. 2014 నుంచి నేటి వరకూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తాము ఇప్పటి వరకు లెక్కలేనన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు అదుపు లేకుండా పెరగడం వల్ల రవాణారంగా కార్మికుల జీవనం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్నారు. పెరిగిన ఇంధన, నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను ప్రస్తుతం ఉన్నదానిపై కిలోమీటర్ కు రు.20 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు అమానుల్లా ఖాన్ ఒమర్ ఖాన్, జంగయ్య, మల్లేష్ గౌడ్, అజయ్ బాబు, కిరణ్, సత్తి రెడ్డి, సలీం, నజీర్, మల్లేష్, బాబు, లతీఫ్, శ్రీనివాస్, యాదగిరి, ఫరూక్, అబ్బాస్, శ్యామ్ అంబదాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

సత్కారం


టాప్ మోడల్ ఇంటర్నేషనల్ విజేత అద్నాన్ అన్వర్ అహ్మద్ ఖాన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: సిటీ హై లైఫ్ మ్యాగజైన్ వారు నిర్వహించిన మోడలింగ్ పోటీలలో టాప్ మోడల్ ఇంటర్నేషనల్–2023 విజేత అద్నాన్ అన్వార్ అహ్మద్‌ఖాన్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సేవా రత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ సంఘం కార్యాలయంలో సత్కరించి అభినందించారు. వర్ధమాన మోడల్స్‌కు తమ సంఘం తరఫున నిరంతరం సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, హరిబాబు, ముఖీమ్, సుజాత, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీఆర్ఎస్ చిత్తుగా ఓడించడం ఖాయం'


ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీఆర్ఎస్ పార్టీ చిత్తుగా ఓడించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్ఎస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు తెలిపారు. ఓటుకు రూ.లక్ష ఇచ్చినా బీఆర్ఎస్ గెలవదని ఎమ్మెల్యే రాజాసింగ్ అహంకారంతో వ్యాఖ్యలు చేశారన్నారు. బీఆర్ఎస్ వెయ్యికోట్లు ఖర్చుచేసినా తానే నెగ్గుతానని రాజాసింగ్ పేర్కొనడం దారుణమన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధితోనే గోషామహల్‌లో రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఓట్ల కోసం నోట్లు ఇచ్చే సంస్కృతి తమది కాదని, ప్రజాదరణతోనే విజయం సాధిస్తామని ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయం అభినందనీయం

లిబర్టీ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడాన్ని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ స్వాగతించారు. సంప్రదాయ వృత్తిని నమ్ముకుని దినదిన గండంలా బతుకు బండి లాగిస్తున్నా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందని పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకి సేవా సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో లక్షల సంఖ్యలో వాల్మీకులు జీవనం సాగిస్తున్నారని ఆర్థిక సామాజిక రాజకీయ రంగంలో అనేక అణిచివేతకు వివక్షతకు గురవుతూ జీవన స్థితిలో మార్పు లేక బతుకులు వెల్లదీస్తున్నారన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చడంతో విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వాల్మీకులు అభివృద్ధి చెందుతారని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అంజలి గార్డన్ వద్ద వాహనాలు వేగంగా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నాయని, వాటి వేగాన్ని నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ నుంచి పుప్పాలగూడ పెట్రోల్ పంప్ వరకు ఇటీవల రోడ్డుకు మరమ్మత్తులు చేయటంతో వాహనాలు ఉదయం, సాయంత్రం వేగంగా వెళుతున్నాయని వారు పేర్కొన్నారు. గురువారం రాత్రి రెండు కార్లు ఢీ కొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయని, వెంటనే అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. రాక్ చర్చ్ రోడ్డు గూండా నూతనంగా రూ.10 లక్షల వాటర్ ట్యాంక్ నుంచి ప్రశాంత్‌నగర్ సంపు వరకు 225 వాటర్ లైన్, పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యచరణతో పనులను చేపడుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


ప్రజల ఫిర్యాదులపై స్పందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీకి బయలుదేరుతుండగా కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్ల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. పలు కార్యాలయాల్లో తమ దరఖాస్తులపై ఎమ్మెల్యే సంతకం కావాలని అధికారులు అంటున్నారని దరఖాస్తులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తులపై వెంటనే సంతకం చేసి ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 3 దశాబ్దాలకు పైగా తాను ప్రజాసేవలో ఉన్నానని, ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అది తెలుసుకుని ఆ పనులను వెంటనే చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగానే ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో మీ సేవలో మజ్లిస్, గడపగడపకు మజ్లిస్ కార్యక్రమాలను ప్రారంభించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తునానన్నారు. జల మండలి, బల్దియా అధికారుల పనితీరుపై కూడా తనకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, అయితే తాను ఆ అధికారులతో మాట్లాడి వారు ప్రజలకు పని దినాల్లో వారి వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. నేడు జలమండలితో పాటు బల్దియా, విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా తాను సైతం ఫిర్యాదులపై స్పందించి ఎంత రాత్రైనా సరే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నానన్నారు.

మురుగు.. పరుగు

గౌలిపురా: పటేల్‌నగర్ బస్తీలో కొన్ని రోజులుగా డ్రైనేజీ మురుగు నీరు రోడ్డు ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దారిలో ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోతున్నారు. ఉదయం వేళల్లో పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రైనేజీ మురుగునీటిపై దోమల వ్యాప్తి చెంది ఇళ్లల్లోకి చేరుకుంటున్నాయని, ప్రజలు అనారోగ్యాలకు గురి కాకముందే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


పటేల్‌నగర్ బస్తీలో ఇళ్ల మధ్య పొంగిపొర్లుతున్న మురుగు నీరు

తప్పిన పెను ప్రమాదం


గోల్కొండ కోట వద్ద కారు డ్రైవింగ్‌తో ధ్వంసమైన తోపుడు బండి

గోల్కొండ: అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో తెల్లవారు జాము, రాత్రి 10 తరువాత మైనర్లు కార్లు తీసుకుని రోడ్లపై అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేస్తున్నారు. శిక్షకులు లేకుండానే వీరు అతివేగంగా కారు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం షేక్‌పేట్ ఫ్లై ఓవర్ వద్ద ఓ మైనర్ తెల్లవారు జాము కారునడపుతూ ఫ్లై ఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టారు. అదే విధంగా శుక్రవారం ఉదయం గోల్కొండ కోట బాలహిస్సార్ బస్టాప్‌లో ఇద్దరు మైనర్లు కారుతో వచ్చి స్థానికులను పరేషాన్ చేశారు. ఆ సమయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వేగంగా వస్తున్న కారును చూసి పరుగులు తీశారు. కారు నడుపుతున్న ఓ మైనర్ బాలుడు అదుపుతప్పి బస్టాప్ పక్కన ఉన్న ఓ తోపుడు బండితో పాటు జ్యూస్ సెంటర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో జ్యూస్ సెంటర్ పూర్తిగా ధ్వంసం కాగా తోపుడు బండి కూడా పనికిరాకుండా పోయింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రూప్‌లాల్‌బజార్, అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జీఎం చావునీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. నీలం సెంటర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. పూల్‌బాగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రెయిన్‌బజార్, మూన్ స్టార్, నెహ్రూనగర్, హబీబ్‌నగర్, రాజ నర్సింహానగర్, జమాల్ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

హోంగార్డుపై చేయి చేసుకున్న ముగ్గురికి జైలు

నాంపల్లి: విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డుపై చేయి చేసుకున్న ముగ్గురికి 12వ ఏసీఎంఎం కోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్షను విధించింది. అక్టోబర్ 8వ తేదీ 2018న నిలోఫర్ ఎక్స్‌రోడ్ వద్ద నాంపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు వి.జనార్దన్ విధులు నిర్వహిస్తున్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించే వాహనదారుల దృశ్యాలను కెమెరాలో చిత్రీకరిస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన గౌస్ ఖాన్, జాఫర్ ఖాన్, సాబేర్ అనే ముగ్గురు వ్యక్తులు ట్రాఫిక్ హోంగార్డు జనార్దన్‌తో గొడవకు దిగారు. ఈ క్రమంలో ముగ్గురు హోంగార్డుపై చేయి చేసుకోవడమే కాకుండా దుర్భషలాడుతూ దురుసుగా ప్రవర్తించారు. దీంతో తన విధులకు ఆటంకం కలిగించిన, తనపై చేయి చేసుకుని చొక్కాను చించేసిన గౌస్ ఖాన్, జాఫర్ ఖాన్, సాబేర్ అనే ముగ్గురిపై నాంపల్లి శాంతి భద్రతల పోలీసు స్టేషన్‌లో జనార్దన్ ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ముగ్గురిపై చార్జిషీట్ నమోదు చేసి న్యాయ స్థానం ముందు హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన 12వ ఏసీఎంఎం న్యాయ స్థానం ముగ్గురిని దోషులుగా ప్రకటిస్తూ ముగ్గురికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించింది.

పేద ప్రజల అభ్యున్నతికి బీజేపీ కృషి


సమావేశంలో మాట్లాడుతున్న వక్త

బండ్లగూడ: భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతికి బాటలు వేస్తామని బీజేపీ స్పోక్స్ పర్సన్ సి.హెచ్.విఠల్ అన్నారు. ప్రజా గోస– బీజేపీ భరోసా రాష్ట్రవ్యాప్తగా శక్తికేంద్ర స్థాయి కార్నర్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. రాజేంద్రనగర్ నియోజవర్గం మొత్తం కలిసి మొదటి శక్తికేంద్ర కార్నర్ మీటింగ్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ అమ్మవారిని దర్శించుకొని ప్రారంభించారు.

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ శక్తికేంద్ర స్థాయి కార్నర్ సమావేశాన్ని కార్పొరేషన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పోక్ పర్సన్ సి.హెచ్.విఠల్, శక్తికేంద్ర ఇన్‌చార్జీ నర్సింగ్‌గౌడ్‌లు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందేలా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు విజయ్‌కుమార్, అశోక్, మల్లేష్‌యాదవ్, కోకన్వీనర్ మహాలింగంగౌడ్ పాల్గొన్నారు.